ఐలా నుండి రూ.2,32,68,809 పన్ను వసూళ్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీలో ఆస్తిపన్నులు వసూళ్లలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది మరింత చురుగ్గా పనిచేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గాజువాక జోన్‌లో ఏపీఐఐసీ ఐలా నుండి రూ. 2,32,68,809 పన్ను చెక్కును అదనపు కమిషనర్ రమణమూర్తి సారధ్యంలో డీసీఆర్ శ్రీనివాసరావు, గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు, ఆర్వో రామనారాయణ, గాజువాక జోన్ ఆర్ఐలు పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వారిని అభినందిస్తూ మరింత చురుగ్గా జీవీఎంసీల పెండింగ్ పన్నులను వసూలు చేయాలని కోరారు.

మహనీయుల బాటలో పయనిద్దాం...
భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దాం

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మన కోసం.. మన దేశం కోసం అహర్నిశలూ శ్రమించి, స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామని, వారిలాగే భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 9 నుంచి జరుగుతున్న హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక బీచ్ రోడ్డులో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై... హర్ ఘర్ తిరంగా అంటూ నినదిస్తూ మువ్వెన్నల జెండా చేత బట్టి ముందుకు సాగారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఊపి హర్ ఘర్ తిరంగా యాత్రను ప్రారంభించారు. ఈ క్రమంలో యూసీడీ, ఐసీడీఎస్, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హర్ ఘర్ మేళాను తిలకించారు. అక్కడ ప్రదర్శనలో ఉంచిన వివిధ వస్తువులను పరిశీలించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి విద్యార్థులు, అధికారులు, క్రీడాకారులతో కలిసి ర్యాలీగా సాగారు. ఈ సందర్భంగా అక్కడకు విచ్చేసిన వారిని ఉద్దేశించి కలెక్టర్ ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటంలో సమర యోధులు ఎంతో కృషి చేశారని, ఎన్నో త్యాగాలను చేశారని గుర్తు చేశారు. వారి త్యాగాలను, సాహసాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. వారి బాటలో పయనించి యువత సూపర్ పవర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. తోటి వారికి తోడ్పడాలని, సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా లాంటి కార్యక్రమాల ద్వారా ప్రతి భారతీయ పౌరుడూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దేశ ప్రయోజనాలు, సమాజ హితం కోసం అంకితభావంతో పని చేయాలని హితవు పలికారు. పింగళి వెంకయ్య లాంటి మహానుభావులు రాష్ట్రం నుంచి స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యమయ్యారని గుర్తు చేశారు. జిల్లా నుంచి అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటం చేసి స్వాతంత్ర్య సంగ్రామంలో మనకంటూ ఓ స్థానాన్ని పదిలపరిచారని పేర్కొన్నారు. ఇలాంటి మహనీయుల జీవిత విశేషాలను స్ఫూర్తిగా తీసుకొని, వారి ఐడియాలజీకి అనుగుణంగా అన్ని రంగాల్లో అనూహ్యమైన వృద్ధి ఫలాలను సాధించాలని సూచించారు. నేడు భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచలోనే నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. మహిళలు, యువత ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా పయనించాలని, అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. భారత దేశం మరింత ప్రగతి పథంలో పయనించేలా మనమంతా సమష్టి కృషి చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

జాతీయ జెండా రంగుల మాదిరిగా సమాజంలోని అందరూ కలిసి మెలసి ఉండాలని, ధైర్య సాహసాలు కలిగి ఉండాలని, భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించాలని ఉపదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జిల్లా టూరిజం అధికారిణి జ్ఞానవేణి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, డీఎస్డీవో జూన్ గ్యాలియెట్, యూసీడీ పీడీ ఫణిరాం, డీఐపీఆర్వో ఎస్.వి.రమణ, డీఆర్డీఏ పీడీ, జిల్లా యువజన అధికారి, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో జూడాలు ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ కేజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు ధర్నా నిర్వహించారు. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ కేజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఢిల్లీలో జరిగి రేప్ కేసులో 2013 నిర్భయ చట్టాన్ని తీసుకొచ్చిన ఆడవారిపై దాడులు ఆగడం లేదని, డాక్టర్లను దేవుళ్ళుగా భావించే ఈ సమాజంలో డాక్టర్లకే రక్షణ లేకపోతే ఎలా అంటూ జూనియర్ డాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. కలకత్తాలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌పై ఇంత దారుణంగా దాడి చేసి అమానుషంగా రేప్ చేసి చంపేయడం దారుణమని జూనియర్ డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నైట్ డ్యూటీ చేసే మహిళ డాక్టర్లకు రక్షణ కల్పించేది ఎవరు అని ప్రశ్నించారు. ఇకనైనా నిర్భయ చట్టాలు లాంటి బలమైన చట్టాలను తీసుకువచ్చి తమకు తగు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ జిమ్ పనుల పరిశీలన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు గొల్లవిల్లివానిపాలెం సమీపంలోని సాయిసాధానగర్‌లో సుమారు 9.63 లక్షలు జీవీఎంసీ నిధులతో చేపట్టిన బహిరంగ వ్యాయామ శాల (ఓపెన్ జిమ్) పనులను స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో నాణ్యత లోపించకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మన దేముడు మాట్లాడుతూ ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలతో ప్రజలకు ఫిట్‌నెస్ పెంపొందుతుందన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం పట్ల ఫిట్నెస్‌తో పాటు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. జీవీఎంసీ నిధులు 38.52 లక్షలతో నాలుగు బహిరంగ వ్యాయామశాలలు (ఓపెన్ జిమ్స్) వార్డులో ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆకుల వాసు, ఊట పెంటారావు, నాయుడు, ఆర్.సూరిబాబు, కెవిఆర్.లక్ష్మి,భవాని, సాయిసాధానగర్ కాలని ప్రతినిధులు డి.కృష్ణారావు, ఏ.నాగభూషణం, తిరుపతిరావు, బంగారు కృష్ణ, ప్రతీక్, కార్తీక్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు వద్ద డైనో పార్క్‌లో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో బీచ్ రోడ్డు వద్ద ఉన్న డైనో పార్క్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా దట్టమైన పొగతో కూడిన మంటలు వ్యాపించి డైనో పార్క్ మొత్తం అగ్నికి ఆహుతైంది. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఆర్కే బీచ్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. డైనో పార్క్ రెస్టో కేఫ్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. పాండు రంగాపురం మత్స్య దర్శిని పక్కనే ఉన్న డైనో పార్క్‌లో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో డైనో పార్క్ రెస్టారెంట్ పూర్తిగా కాలి బూడిదైంది. భారీ మంటలు, దట్టమైన పొగ కారణంగా చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. రెస్టారెంట్ పక్కన ఇళ్లలోని వారు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఆస్తి నష్టం అంచనా వేస్తున్నారు. వెదురు బొంగులు, కలపతో రెస్టారెంట్‌ను నిర్మించడంతో మంటలు భారీ స్థాయిలో ఎగిసిపడ్డాయని అధికారులు తెలిపారు.

పనుల నాణ్యతలో రాజీ సహించను

వీఎంఆర్డీఏ ఎంసీ విశ్వనాథన్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమీషనర్ కెఎస్ విశ్వనాథన్ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం చినముషిడివాడలో నూతనంగా నిర్మించిన రెండు అంతస్తుల కళ్యాణ మండపం భవనాన్ని పరిశీలించారు. సంస్థకు ఆదాయం పెంచే విధంగా నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. సబ్బవరం నుండి గుల్లేపల్లి వరకు రూ.5.71 కోట్ల నిధుల వ్యయంతో చేపట్టిన బృహత్తర ప్రణాళిక రహదారి విస్తరణ పనులను పరిశీ లించారు. రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలను వెంటనే మార్పించాలని, పనులను వేగవంతం చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లో పాటించాలని, నిర్లక్ష్యం వద్దని సూచించారు. అడ్డూరు, పైడివాడ అగ్రహారం, కోడూరు 1, 2, 3, 4 లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. అనకాపల్లి రావు గోపాలరావు కళాక్షేత్రంలో జరుగుతున్న మరమ్మతు పనులను, తుమ్మపాలలో సంస్థకు చెందిన భూములను పరిశీలించారు. అనంతరం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ని కలిసి పలు అంశాలను చర్చించారు. ఈ పర్యటనలో ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికాధికారి సంజయ్ రత్న కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వహక ఇంజినీర్ సింగ్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రవిశంకర్ సాంకేతిక, ప్లానింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్లానింగ్ కార్యదర్శులు బాధ్యతతో విధులు నిర్వహించండి

- జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని పట్టణ ప్రణాళికా విభాగం వార్డు ప్లానింగ్ కార్యదర్శులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. మంగళ వారం ఆయన వి.ఎం.ఆర్.డి.ఎ. చిల్డ్రన్ ఎరీనా థియేటర్‌లో పట్టణ ప్లానింగ్ విభాగపు అధికారులు, వార్డు ప్లానింగ్ కార్య దర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ నగరంలో గల భవన నిర్మా ణాల అనుమతుల మంజూరు, అనధికార కట్టడాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, ప్రజా ఫిర్యాదుల విషయమై ప్రజల నుండి అధిక శాతం పట్టణ ప్రణాళిక విభాగానికి సంబం ధించినవే వస్తున్నాయన్నారు. ఈ విషయమై ఎ.పి.డి.పి.ఎం.ఎస్. ఆన్లైన్ పోర్టల్ నందు బిల్డింగ్ అనుమతులకు సంబంధించి ఎక్కువ రోజులు చర్యలు చేపట్టక పోవడంపై వార్డు ప్లానింగ్ కార్యదర్శుల విధులు బాధ్యతారహితంగా కనిపిస్తున్నాయని పలువురు కార్యదర్శులపై కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డింగ్ నిర్మాణాల అనుమతుల మంజూరుపై వెంటనే చర్యలు చేపట్టడం, ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపా డడం, అనధికార నిర్మాణాలను నిలువరించడం, ప్రజా ఫిర్యాదు లను సకాలంలో పరిష్కరించే దిశగా ప్లానింగ్ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని కమీషనర్ ఆదేశించారు. ఇకపై విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై తప్పకుండా తీసుకొనే కఠినమైన చర్యలకు గురికాకుండా, ప్లానింగ్ కార్యదర్శులు నిజాయితీ, క్రమ శిక్షణతో పని చేయాలని కమీషనర్ ఆదేశించారు. నిబద్ధతతో పని చేసే ప్రతి ప్లానింగ్ కార్యదర్శులను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు అందిస్తామని కమిషనర్ ఈ సందర్భంగా తెలియ జేశారు. ఈ సమీక్షలో ముందుగా పట్టణ ప్రణాళిక విభాగము విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జివిఎంసి ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్ కుమార్ కమీషనర్ కు వివరించారు. అనంతరం కమీషనర్ సూచనలను తూచా తప్పకుండా పాటించే విధంగా పట్టణ ప్రణాళికా విభాగాన్ని బలో పేతం చేస్తామని కమీషనర్ కు ఆయన తెలిపారు. ఈ సమీక్షలో సిటి ప్లానర్ మహాలక్ష్మి దొర, డిసిపిలు కె.పద్మజ, రామలింగేశ్వర రెడ్డి, దవళ శ్రీనివాసరావు, ఎసిపిలు, టిపిఒలు, టిపిఎస్ లు, టిపిబిఒలు, ఆర్ఎఫ్ఒ హనుమంతరావు, టౌన్ సర్వేయర్లు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - మల్కాపురం: దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా మంగళవారం పారిశ్రామిక ప్రాంతంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని జింకు గేటు వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటిదాకా పంచాయతీకి వంద రూపాయలు, మేజర్ పంచాయతీకి 250 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులు కింద ఇచ్చేదని, కానీ మన ప్రభుత్వం ఏర్పాటు కాగానే పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీకి 10000, మేజర్ పంచాయతీకి 25000 చొప్పున ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం బీజేపీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించగా బిజెపి వెస్ట్ కన్వీనర్ దాడి పురుషోత్తము, రమేష్, ములగాడ మండల అధ్యక్షులు కవులూరి గురుమూర్తి, బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు కొక్కిలిగడ్డ విజయబాబు, తేప్పల సతీష్, గుర్తుల సతీష్, జనసేన నాయకురాలు అంగా దుర్గ ప్రశాంతి, టిడిపి నాయకులు విశ్వనాధుల దినకర్, నక్క లక్ష్మణరావు, రాము, మిత్తిరెడ్డి శంకర్రావు, పూడి భాస్కరరావు, కోరాడ శ్రీనివాసరావు, మాత శ్రీనివాసరావు, మజ్జి సోమేశ్, గేదెల రమణగారు, పోతాబత్తుల శ్రీనివాసరావు, జనసేన అనిల్ పాల్గొన్నారు.

500 మంది విద్యార్థులకు పోటీలు

విశాలాంధ్ర - విశాఖ: స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాండురంగాపురం పార్కు కన్వెన్షన్ హాల్లో పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పబ్లిక్ స్పీచ్, వ్యాస రచన, క్విజ్, డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, ఫైర్ లెస్ కుకింగ్, సింగింగ్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదాయపు పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ మధుసూదన రావు హాజరై బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థితప్రజ్ఞ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు విద్యార్థినీ, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అభినందించారు. స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద లక్ష్యాలతో ముందుకు వెళ్ళాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైనాన్స్ ఆఫీసర్ సూర్యరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ చదువుతోపాటు క్రీడలపై కూడా శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోదాంబికా, వై.చిన్నయ్య దొర, కే.సునీత, లావణ్య, స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ మెంబర్స్ ప్రదీప తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి 35 ఏళ్ళు పూర్తి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్యాన్నదానం ప్రారంభించి నేటికి 35 ఏళ్ళు పూర్తయింది. సింహాద్రి అప్పన్న నిత్యాన్న ప్రసాదం కార్యక్రమం 1989, ఆగష్టు 14వ తేదిన రూ.50 వేలతో సింహాచలం దేవస్థాన ఉద్యోగ సంఘం విరాళంతో ప్రారంభమైంది. అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అన్న ఆర్యోక్తులను నిజం చేస్తూ సింహాచలేశుని దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం చేసే నిత్యాన్నదానానికి నేటికి 35 ఏళ్లు పూర్తయ్యాయి. ఇంతింతైవటుడింతై అన్నట్లు లక్షల రూపాయల విరాళాలతో ప్రారంభమైన అప్పన్న నిత్యాన్నదాన పథకం విరాళాల మొత్తం ప్రస్తుతం సుమారు రూ.35.55 కోట్లు దాటిందని, ఈ ఫిక్సెడ్ డిపాజిట్లపై రూ. 1.96,62,832/-లు వడ్డీ వస్తుంది. వచ్చిన వడ్డీతో నిత్యాన్న ప్రసాదం భక్తులందరికీ ఏర్పాటు చేస్తున్నామని కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఇన్‌చార్జ్ సహాయ కార్యనిర్వ హణాధికారి పి.నరసింగరావు తెలిపారు. ప్రతి నిత్యం సింహగిరికి శ్రీ వరాహలక్ష్మి నృసింహ స్వామిని దర్శించటానికి దేశ, విదేశ, రాష్ట్ర, అంతరాష్ట్ర నుండి నుంచి వచ్చే భక్తులకు శ్రీ స్వామివారి నిత్యాన్నదాన పథకానికి దాతలు ఇచ్చే విరాళాలపై వచ్చే వడ్డీతో భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. నిత్యాన్నదాన ట్రస్టుకు ఉదారులైన దాతల నుండి పది రూపాయల నుంచి అపరిమితంగా విరాళాలను సేకరించడానికి సింహగిరిపై రాజగోపురం సమీపంలోను, అన్నదాన భవనం వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. శ్రీస్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష ఆ పై విరాళం ఇచ్చే దాతలను మహారాజ పోషకులుగా, రూ. 50,000లు ఆపైన విరాళం ఇచ్చిన దాతలను రాజ పోషకులుగా, రూ. 10,000లు ఆపైన విరాళం ఇచ్చిన వారిని పోషకులుగా, రూ. 1,116లు ఆపైన విరాళం ఇచ్చిన వారిని దాతలుగా పరిగణిస్తారు. దాతలు చెల్లించిన అసలు సొమ్మును జాతీయ బ్యాంకులలో జమ చేసి దానిపై లభించే వడ్డీ మొత్తంలో మాత్రమే దాత పేరు మీద శాశ్వతంగా ప్రతి సంవత్సరం వారు కోరిన రోజున అన్నప్రసాదం వితరణ జరుపుతారు.

బౌద్ధ మిషన్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - గాజువాక: స్టీల్‌ప్లాంట్ బౌద్ధ మిషన్ చేపడుతున్న సేవలు అద్భుతమని ఉక్కు డైరెక్టర్ (కమర్షియల్) జీవీఎన్ ప్రసాద్ కొనియాడారు. ఉక్కు నగరంలో బౌద్ధ మిషన్ 31వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ఉక్కు డైరెక్టర్ జీవీఎన్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 1993 ఆగస్టు 12న బౌద్ధ మిషన్ ఏర్పాటై నేటికీ 31 సంవత్సరాలు పూర్తి చేసుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీ ల విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే బౌద్ధ మిషన్ కు ఇప్పటి వరకు సేవలందించిన బౌద్ధ మిషన్ ప్రతినిధులు అంబటి సర్వేశ్వరరావు, ఎన్.బాల భాస్కరరావు, సూర్యారావులను ముఖ్య అతిథి సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ బౌద్ధ మిషన్ ప్రధాన కార్యదర్శి డా. పరమట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టిఎల్ టెక్నికల్ మేనేజర్ ఎన్.రమేష్ కుమార్, మాటూరి శ్రీనివాసరావు, కె.పరంధామయ్య, పొల్తేటి పెంటరావు, లక్ష్మణ మూర్తి, వి.ఎస్ పి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బయే మల్లయ్య, కుంచె సత్యనారాయణ పాల్గొన్నారు.

అవంతిలో అధ్యాపక బోధన అభివృద్ధిపై శిక్షణ

విశాలాంధ్ర - తగరపువలస: అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ సభ్యుల కోసం బోధన అభ్యాస ప్రక్రియ, పరిశోధన ఉత్పత్తిని మెరుగుపరచడం కోసం "జనరేటింగ్ రీసెర్చ్ టూల్స్ అండ్ టెక్నిక్స్"పై సమగ్ర నిపుణుల సెషన్ నిర్వహించారు. ఈ సెషన్‌కు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుండి డాక్టర్ జి.వి.నగేష్ కుమార్ హాజరై పలు అంశాలపై వివరించారు. సమర్థవంతమైన పాఠ్యాంశాలను రూపొందించడానికి, అందించడానికి, విద్యార్థి-కేంద్రీకృత అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి, పరిశోధన-ఆధారిత వాతావరణాన్ని పెంపొందించడానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఏ.చంద్రశేఖర్, అసోసియేట్ డీన్ ఆర్‌డి డాక్టర్ షరీఫ్ పాల్గొన్నారు.

గేట్ల దుస్థితిపై దృష్టిసారించండి

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ నగర ప్రజల దాహార్తిని తీర్చే ప్రధాన జల వనరు మేహాద్రి రిజర్వాయరు. అధికారుల నిర్లక్ష్యంతో దీని భద్రతపై ఎప్పటికప్పుడు భయాందోళనలు వ్యక్తం అవుతు న్నాయి. జలాశయ గేట్ల దుస్థితిపై దృష్టి సారించడం లేదు. చూద్దాం... చేద్దాం అనే రీతిలో ఉన్నారు. రెండు రోజుల క్రితం కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో అంతటా భయా ందోళన వ్యక్తమవుతోంది. ముమ్మం దు భారీ వర దలు సంభవిస్తే మేహాద్రి గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సమాచారం. నగర ప్రజల అవస రాల నిమిత్తం సుమారు 2/16 ఎకరాలు సేకరించి రిజర్వాయర్‌ను 1877లో నిర్మించారు. నాటి నుంచి ప్రజల దాహార్తిని తీర్చుతోంది. నగరంలోని కొన్ని పరిశ్రమలకు ఇక్కడి నుంచే కొంత కాలం జలాలను అందించారు. ఇటీవల కాలంలో నీటినిల్వ తక్కువగా ఉండటంతో పరిశ్రమలకు తగ్గించారు. ప్రస్తుతం రిజర్వాయరు గరిష్ట నీటిమట్టం 81 అడుగులు. ప్రస్తుతం 48.5 అడుగులు మాత్రమే నీరుంది. 1వ నంబరు గేటు ఐదేళ్లుగా ఒక్కసారి కూడా పైకిలేవని పరిస్థితి ఏర్పడింది. 6, 5వ నంబరు గేటు పరిస్థితి 15 ఏళ్లుగా అలాగే ఉంది. మరమ్మతుల నిమిత్తం దాదాపు రూ.2.5 కోట్లు మంజూరు చేయాలని ఈ జలాశయ నీటిని వినియోగించుకుంటున్న జీవీ ఎంసీని మూడేళ్ల క్రితం జలవనరుల శాఖ అధికా రులు కోరారు. అయిన ప్పటికీ రూపాయి కూడా ఇవ్వలేదు. భారీవర్షాలకు రిజర్వాయరు నీటమట్టం పెరిగి నీటిని కిందికి వదిలే సమయాల్లో లోతట్టు ప్రాంతాలైన యల్లపువాని పాలెం, భగత్‌సింగ్‌నగర్, విమా నాశ్రయం, శీలానగర్ జలమయమవు తున్నా యి. భారీ వరదలు సంభవించి ప్రస్తుతం పని చేయని గేట్లు ఏదైనా ప్రమాదానికి గురైతే ఊహించని నష్టం జరుగు తుందని కొందరు సిబ్బంది చెబుతున్నారు. నీరు తక్కువగా ఉన్న సమయంలోనైనా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సర్కార్ స్థలంలో రెవెన్యూ బోర్డు మాయం

హైవే పక్క స్థలంపై వ్యాపారుల కన్ను

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని పాలవలస రెవెన్యూ పరిధిలో ఒక ప్రైవేట్ లేఔట్ ప్రక్కనే ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు ఇదివరకు రెండు మూడుసార్లు ఏర్పాటు చేసిన బోర్డ్‌లను మాయం చేస్తున్నారు. అసలే నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్న స్థలం కోట్లలో ధర పలుకుతుందని ఇదే అదునుగా చూసుకొని కొంతమంది వ్యాపారులు కన్ను ఆ స్థలంపై పడింది. రెవెన్యూ అధికారులు ఇదివరకు ఆ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ దళారులు రాత్రి వేళల్లో బోర్డులను లేకుండా చేస్తున్నారు. కోట్లలో విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని ఆ స్థలానికి రక్షణగా బోర్డ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాన్ని రక్షించవలసిందిగా స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE IV ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA

O.S.NO. 37 / 2024

Between :
Sama Jyothi Prasanna Varalakshmi ... Plaintiff
And
Vijjada Srinu Banari ... Defendant
To:-
Defendant : Vijjada Srinu Banari, S/o. Late Durga Rao, R/o.D.No. 24-80-52/2, Santhi Nagar, Old Gajuwaka, Visakhapatnam - 530026.

పై నెంబరు దావాని వాది ప్రతివాది పైన దావా దాఖలా షెడ్యూలు ఆస్తికి తనను ఓనర్‌గా డిక్లేర్ చేయమని మరియు ఇతర రిలీఫ్‌లు కోరుతూ దాఖలు చేయగా, అందు పై దావాలో ప్రతివాదికి సమన్స్ నిమిత్తం గౌరవనీయులైన కోర్టువారు **ది.04-09-2024**నకు వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ రోజు **ఉదయం గం.10.30ని.లకు** ప్రతివాది స్వయంగా కానీ, అడ్వకేట్ గారి ద్వారా కానీ పై కోర్టులో హాజరై అక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

వాయిదా తేది : 04-09-2024

చందు నాగరాజ్
వాది తరపు అడ్వకేట్, విజయవాడ

విశాలాంధ్ర

విశాఖపట్నం

బుధవారం 14, ఆగస్టు, 2024

అపోహాలు విడనాడి అవయవదానంకు ముందుకురావాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ఒకరి అవయవదానంతో కొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని, కావున అపోహాలు విడనాడి అవయవదానం చేసేందుకు ముందుకురావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అవయవదానం తప్పుకాదని, మహెూత్తర కార్యక్ర మమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటువంటి మహత్తర కార్యక్రమంలో భాగస్వా మ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర జీవన్ దాన్ ఆధ్వర్యంలో అవయవదాన అవగాహనా కార్యక్రమం స్థానిక ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో మంగళవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది అవయవాల కోసం నిరీక్షిస్తున్నారని, ఇంతమందికి అవయవాలు లభించకపోవడానికి ప్రజల్లో సరైన అవగాహనా లేకపోవడమేనని అన్నారు. అవయవదానం చేయగలిగి ఉనప్పటికీ అపోహలతో ముందుకు రావడం లేదని తెలిపారు. కావున దీనిపై వైద్య సిబ్బంది, ఎన్.జీ.ఓలు ప్రజలకు అవగాహనా కల్పించి అవయవదానంకు ముందుకు వచ్చేలా ప్రజలను చైతన్య పరచాలని కోరారు. అవయవ దానంతో ఎటువంటి నష్టం ఉండబోదనే అభిప్రాయానికి ప్రజలు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బ్రెయిన్ డెడ్ అయి, కుటుంబ సభ్యుల పూర్తి అంగీకారంతో మాత్రమే అవయవాలను తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఇతరులకు అవయవాలను అమర్చడం జరుగుతుందని ఆయన స్పష్టం చేసారు. డబ్బులు చెల్లిస్తే అవయవాలు లభిస్తాయానే దళారుల మోసపూరితా ప్రలోభాలకు గురికావద్దని కలెక్టర్ హితవు పలికారు. భవిష్యత్తులో అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, తద్వారా మరింత మెరుగైన వైద్యం అందించి, మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎక్కువ మంది దాతల నుంచి అవయ వాలను సేకరించిన కిమ్స్ ఐకాన్, కేర్ ఆసుపత్రి యాజమాన్యాలను, బ్రెయిన్ డెడ్ అయి అవయవాలను దానం చేసిన విపిన్ మెహతా, సిహెచ్.భవాని, ఆర్.రామలక్ష్మీ, కె.పవన్ కుమార్, వి.శ్రీనివాసరావు, ఎస్.లలిత కుటుంబ సభ్యులను జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, రాష్ట్ర జీవన్ దాన్ సమన్వయ కర్త డా. కె.రాంబాబులతో కలిసి కలెక్టర్ ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ అవయవదానం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఇందుకోసం వివిధ రకాల ర్యాలీలు, క్యాంపులు, అవగాహనా సదస్సులు నిర్వహించాలని సూచించారు. తద్వారా ఎక్కువ మంది అవయవ దానంకు ముందుకు వస్తారని, దానితో మరి కొందరి జీవితాల్లోకి వెలుగులు తీసుకురావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో అవయవాల పేరిట ప్రజలను మోసాలు చేస్తున్నారని, అటువంటివి నమ్మవద్దని హితవు పలికారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, మార్గదర్శకాల మేర అవయవాలను ఇతరులకు అమర్చడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర జీవన్ దాన్ సమన్వయ కర్త, విమ్స్ డైరక్టర్ డా. కె.రాంబాబు మాట్లాడుతూ ఇది ఒక అవగాహనా సదస్సు అని అన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో 8 మంది జీవితాల్లో వెలుగులు వస్తాయాన్నారు. రాష్ట్రంలో 3వేలకు పైచిలుకు అవయవదానం కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. విశాఖలో గత 15 రోజుల నుంచి అవయవ దానంపై అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో ఈ ఏడాదిలో 136 మందికి అవయవాలను అమర్చామని, ఇది మంచి శుభ పరిణామమని పేర్కొన్నారు.అవయవదానంకు కుటుంబసభ్యులందరి అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ధనిక, బీద వంటి తారతమ్యం లేకుండా తొలి ప్రాధాన్యతను బట్టి అవయవాలను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రజలు దీన్ని గుర్తించి అవయవదానం కొరకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహనా కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ శివ నాగేశ్వర రెడ్డి, ప్రముఖ ఆసుపత్రుల వైద్యులు, ఎన్జిఓలు, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ యాత్ర

విశాలాంధ్ర – తగరపువలస: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా భీమిలి గంటస్తంభం వద్ద నుండి భీమిలి నియోజకవర్గం బిజెపి కన్వీనర్ ఆద్వర్యంలో ర్యాలీ జరిగింది. విశాఖ జిల్లా బిజెపి ఇంచార్జ్ పుట్టా గంగయ్య ముఖ్య అతిధిగా పాల్గొని స్కూల్ విద్యార్థులతో ప్రతీ ఇంటిపై అందరూ ఆగస్టు 13, 14, 15 వ తేదీలలో జాతీయ జెండాను ఎగువ వేయాలని వివరిస్తూ తిరంగా యాత్రను చేపట్టడం జరిగింది. తర్వాత బిజెపి నాయకులు, స్థానికులు బైక్‌పై ర్యాలీగా బయలుదేరి భీమిలి, ఉప్పాడ, మధురవాడ, యెండాడ, పిఎం పాలెం ప్రాంతాలలో తిరంగా యాత్రను చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధానేష్, నియోజకవర్గం కో–కన్వీనర్ పి.శ్రీనివాసరావు, జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి, జిల్లా కార్యదర్శి బి.అనిల్ కుమార్, వార్డు అధ్యక్షులు కంటుభుక్త సునీత, ఊళ్ళ కొండబాబు, డిఅర్కే రాజు, జిఆర్ఎస్ఎన్ రాజు, చోడవరపు నాగరాజు, బిజెపి నాయకులు పోతిన పైడిరాజు, యెండ అప్పారావు, బత్తిన రమణ, పోలుబోతు విజయ, రేఖ కరుణా రావు, పంపాన సుబ్రమణ్యం, అనిల్ రాజు, బాజిత్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

కలర్డ్ జెమ్ స్టోన్ రింగ్ ఆఫ్ ది ఇయర్' అవార్డును గెలుచుకున్న కీర్తిలాల్స్

విశాలాంధ్ర –విశాఖపట్నం: ప్రముఖ వజ్రాలు బంగారు ఆభరణాల బ్రాండ్ కీర్తిలాల్స్ కి ఇటీవల ముంబైలో జరిగిన రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2024 యొక్క 19వ ఎడిషన్ లో ప్రతిష్టాత్మకమైన 'కలర్డ్ జెమ్ స్టోన్ రింగ్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. ఈ సందర్భంగా కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ శాంత కుమార్ మాట్లాడుతూ నగల ఉత్పత్తిలో వినూత్న డిజైన్ అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించడంలో కీర్తిలాల్స్ నిబద్ధత ఈ అవార్డు ద్వారా గుర్తించబడిందన్నారు. అవార్డు గెలుచుకున్న జెమ్ స్టోన్ ఉంగరం వినూత్న రూపకల్పనకు సమకాలీన వినియోగదారుల యొక్క మారుతున్న అభిరుచులకు అనుగుణంగా డిజైన్ ఆవిష్కరణలో కీర్తిలాల్స్ అంకితభావానికి సరైన ఉదాహరణ, ప్రతి భాగాన్ని విలువైనదిగా నిర్ధారించడానికి, బ్రాండ్ యొక్క పరిశోధన మరియు అభివృద్ధి బృందం ఈ మారుతున్న ప్రాధాన్యతలను అర్థం చేసుకోవడానికి మరియు వాటిని అందించడానికి అవిశ్రాంతంగా పని చేస్తుందన్నారు. 1939 నుండి ఎనిమిది దశాబ్దాలుగా కొనసాగుతున్న వారసత్వంతో, డైరెక్ట్ డైమండ్ సోర్సింగ్, అత్యాదునిక ప్యాక్టరీలు, అత్యాధునిక డిజైన్ స్టూడియో అగ్రశ్రేణి ఉత్పత్తి పద్ధతులతో కూడిన పూర్తి కార్యాచరణతో, కీర్తిలాల్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వజ్రాల సమ్మేళనంగా పేరు తెచ్చుకుందనీ చెప్పారు.

ఆటోనగర్ వచ్చేనా..... ప్రజలు కోరిక తీరేనా....!

విశాలాంధ్ర – ఆనందపురం: ఆనందపురం మండలంలోని కణమాంలో గ్రామపంచాయతీ పరిధిలో 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్క్రాప్ వర్కర్స్‌కు ఆటో నగర్ నిర్మాణం కోసం సర్వేనెంబర్ 50లో సుమారు 157.7 ఎకరాలు కేటాయించడం జరిగింది. తరువాత వచ్చిన వైయస్సార్సీపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాజీ శాసనసభ్యులు అవంతి అప్పటి ప్రభుత్వ పెద్దలు ఈ స్థలంపై కన్నేసి ఆటోనగర్ కాజేశారు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం, ఏపీఐఐసి కి బదులు ఎం ఎస్ ఎంఈ పార్క్‌కు ఇవ్వరాదని సిఐటియు సీనియర్ నాయకులు వై రాజు డిమాండ్ చేశారు. ఇలా ఐతే సరైన న్యాయం జరగదని తెలియజేశారు. ఆటోనగర్ సంఘం నాయకులు కె .గణేష్ మాట్లాడుతూ ఏపీఐఐసీ నిర్మించదానికి సిద్ధం గా ఉన్న ఎం ఎస్ ఎం ఈ పార్కుకు ఇవ్వడం వలన ఇది ఇంకా జాప్యం తో పాటు కార్మికులకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. ఆటో నగర్ కార్మికుల నాయకులు గయ మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన 11 కోట్ల రూపాయల అధికారులకు అందినా ఇంకా రైతులకు, ఫోర్సిరికార్డు ఉన్నవారికి ,ఆక్యుపేషన్ ఉన్నవారికి ఇంకా 3 కోట్లు మేర పరిహారం ఇవ్వలేదని రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని వారికి అందిన వెంటనే ఏపీఐఐసి పనులు ప్రారంభం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, డి వై ఎఫ్ ఐ నాయకులు సంతోష్, సిఐటీయు నాయకులు ఎం సుబ్బారావు, ఆటో నగర్ నాయకులు సమీర ఖాన్, కె సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను భయభ్రాంతులు చేస్తే సహించేది లేదు

విశాలాంధ్ర – కూర్మన్నపాలెం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 1279 వ రోజు సీఐటీయూ ఆధ్వర్యంలో దీక్షా శిబిరంని మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ప్లాంట్ పూర్తిస్థాయి ఉత్పత్తిపై యాజమాన్యం దృష్టి పెట్టకుండా కార్మికులను అధికారులను భయభ్రాంతులను చేస్తుందని ఈ విధానానికి స్వస్తి చెప్పాలని అన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికుల జీవితాలతో చెలగాటమాడే పనిని ఆపాలని పరిశ్రమకు కావలసిన రా మెటీరియల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. యాజమాన్యం దోబర ఖర్చు నివారించాలంటే పలుమార్గాలు ఉండగా అధికారుల జీతాల్లో కోత పెడతామని చెప్పడం అవహేళన చర్యని అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కలుగ చేసుకోవాలని ప్లాంట్ కితక ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్ష శిఖరంలో సీనియర్ నాయకులు డిసిహెచ్ వెంకటేశ్వరరావు, డి.ఎస్.వి. ఎస్ శ్రీనివాస్ గంగాధర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

56 రోజులపాటు శిశువుకు మెరుగైన వైద్యం

శిశువును తరలిస్తూ ఆక్సిజన్ సిలిండర్ మోసే తండ్రి వీడియోపై అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పెద్ద ఆసుపత్రి అయిన కేజీహెచ్‌లో నిత్యం వేలాదిమందికి వైద్య సేవలు అందుతూనే ఉన్నాయి. కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అప్పుడప్పుడు వివిధ సంఘటనలు జరుగుతున్నాయే తప్ప, వైద్య సేవలు అందించడంలో కేజీహెచ్ మించిన ఆసుపత్రి లేదని పేదలు కొనియాడుతున్నారు. జూన్ 18న సునీత విష్ణుమూర్తి దంపతులకు ఉదయం 8.25 గం.లకు కెజిహెచ్ లేబర్ రూమ్‌లో 1.6 కేజీల బరువుతో ఆర్ హెచ్ నెగిటివ్‌తో ఆడ శిశువు జన్మించింది. ఆ శిశువు జన్మించిన సమయంలో ఉన్న పిల్లల డాక్టరు శిశువు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటనే ఎన్ ఐసీయూకు తరలించారు. శిశువును తరలించే క్రమంలో లేబర్ రూమ్ నుంచి తండ్రి విష్ణుమూర్తి ఆక్సిజన్ సిలెండర్‌ను తానే మోసుకొని శిశువును నర్స్ ఎన్ ఐసియుకు తీసుకొని వెళ్ళారు. ఓ వ్యక్తి ఆ వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అప్పట్లో పెద్ద ఎత్తున వైరల్ అయింది. అప్పటి కలెక్టర్ మల్లికార్జున, సూపరింటెండెంట్ అశోక్ కుమార్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వైద్య సిబ్బంది నిర్లక్ష్యం అని అందరూ తప్పుగా అనుకున్నారని, దీనిపై ఆరోజు తండ్రి విష్ణుమూర్తి తానే ఆత్రుత వలన బిడ్డను, బిడ్డ యొక్క ఆక్సిజన్ సిలెండర్‌ను తీసుకుని ఎన్ ఐసీయూకు వెళ్ళానని దీనిలో ఎవరి ప్రమేయం లేదని వివరణ ఇచ్చారు. ఆ శిశువు ఎన్ఐసీయూలో అడ్మిట్ అయిన తర్వాత డా బి.యస్.చక్రవర్తి , డా. సత్యకుమారి ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది స్టాఫ్ నర్సులు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ అందరు కూడా శ్రమించి బిడ్డను కాపాడారు. ఇదే చికిత్స బయట కార్పొరేట్ ఆసుపత్రి నందు అయితే సుమారు రూ.50 లక్షల నుండి రూ.60 లక్షల వరకు ఖర్చు అవుతుందని, ఆ శిశువుకు 56 రోజులగా కెజిహెచ్‌లో ఉండి వైద్యం పొందాలని కేజీహెచ్ సూపర్‌డెంట్ డాక్టర్ శివానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ శిశువుకు ఖరీదైన మందులు ఇచ్చి, బ్లడ్ కూడా ఎక్కించామన్నారు. అన్ని సదుపాయలు కల్పించామని, కెజిహెచ్ ఎంతో ఉన్నతమైన సంస్థ అని అందులో ఉన్న వైద్యులు గాని, వైద్య సిబ్బంది గాని పేషంట్స్ ప్రాణాలను కాపాడటానికి ఎంతో అహర్నిశలు శ్రమిస్తారని తెలపడానికి ఇదియే గొప్ప ఉదాహరణ అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం డిశ్చార్జ్ అయిన సందర్భంగా బిడ్డ తల్లిదండ్రులు కెజిహెచ్ సూపరింటెండెంట్‌కి, వైద్యులకు, స్టాఫ్ నర్సులకు కృతజ్ఞతలు తెలిపారు. తాము 56 రోజుల హాస్పిటల్ లో ఉన్నామని, మాతో పాటు ఎన్నో వందల మంది పిల్లల ప్రాణాలను వైద్యులు కాపాడారని, వారు నిరంతరం శ్రమిస్తూ ఎంతో అంకిత భావం చూపించారని ఆ తల్లిదండ్రులు ఆనందంతో ఇంటి బాట పట్టారు.

రైల్లో పోయిన బ్యాగు స్టీల్‌ప్లాంట్లో ప్రత్యక్షం

విశాలాంధ్ర – కూర్మన్నపాలెం: ఇదేంటి అనుకుంటున్నారా... విధి విచిత్రం అంతే..ఎక్కడో రైల్లో బ్యాగు పోవడం ఏంటి స్టీల్ ప్లాంట్లో ప్రత్యక్షం ఏంటి అనుకుంటున్నారా... చెన్నైకి చెందిన కార్తికేయనుకు హైదరాబాదులో ప్రైవేట్ జాబ్ వచ్చింది. ఆ జాబు కోసం అతను వెళ్లే ప్రయత్నంలో ఈనెల 8న శబరి ఎక్స్ప్రెస్ లో కాట్పాడి నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరాడు. ఆ రాత్రి ట్రైన్‌లో ఒక యువకుడు అతని పక్కన కూర్చొని కొద్దిసేపు మాట్లాడాడు. కొద్దిసేపటి తర్వాత మీరు పడుకోండి. నేను మీ బ్యాగు చూస్తాను అంటూ నమ్మబలికాడు. తెల్లవారి ఒంటిగంట, రెండు మధ్యలో కార్తికేయన్ చూడగా అబ్బాయి కనిపించలేదు, బ్యాగ్ లేదు. దీంతో కంగారుపడిన కార్తికేయన్ నెక్స్ట్ స్టేషన్ ఒంగోలులో దిగి రైల్వే పోలీసులకు, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అక్కడ నుంచి సికింద్రాబాద్ స్టేషన్‌కి వెళ్లి అక్కడ కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే బ్యాగులోని నగదుతో పాటు ల్యాప్టాప్, సర్టిఫికెట్లు, క్రెడిట్ కార్డు, ఏటీఎం కార్డు పోవడంతో అతను ఎంతో దిగులు చెందాడు. ఈ క్రమంలో బ్యాగ్ దొంగిలించిన సదరు వ్యక్తి బ్యాగ్‌లో ఉన్న నగదు 3000 తీసుకొని బ్యాగును పక్కన ఉన్న ఒక గూడ్స్ ట్రైన్ లోకి విసిరేసినట్టు తెలుస్తుంది. ఎందుకంటే ఆ ట్రెయిన్ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తులు కోసం వచ్చింది. ప్లాంట్‌లోని సిడివై యార్డ్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు దామోదర్, తుకరం, గజేంద్ర లోడింగ్ సమయంలో ఆ బ్యాగు చూసి తెరిచి చూడగా అందులో లాప్టాప్, సర్టిఫికెట్లు, కార్డులు అన్ని కనిపించాయి. వెంటనే అందులోనే ఆధార్ కార్డు ఆధారంగా కార్తికేయతో ఫోన్లో మాట్లాడారు. అతనికి ధైర్యం చెప్పారు. స్టీల్ ప్లాంట్ సిఐటియు గౌరవాధ్యక్షులు అయోధ్య రామ్ కు ఆ బ్యాగును అప్పగించారు. ఆ బ్యాగును అయోధ్యరాం హైదరాబాద్ పంపించే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం తెలిసిన కార్తికేయ ఎంతో సంతోషంతో ఇప్పటికీ దేశంలో నిజాయితీ పోలేదని ఈ సంఘటన రుజువు చేసింది అని తెలిపారు. ట్రైన్లో అపరిచితులను నమ్మవద్దు అని, బయటకు వెళ్లిన తర్వాత అతి జాగ్రత్తగా ఉండాలని తన అనుభవాన్ని తెలియజేసాడు. బ్యాంకు అందజేసిన కాంట్రాక్ట్ కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

పంద్రాగస్టు వేడుకలపై అవగాహన

విశాలాంధ్ర – ఆనందపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు గ్రామాల్లో స్వతంత్ర దినోత్సవం కొరకు అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఎంపీడీవో అప్పలనాయుడు అన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అందరూ భక్తిశ్రద్ధలతో పండగ వాతావరణంలో నిర్వహించే విధంగా పిఎం పిలుపుమేరకు ఆనందపురం మండల ఎంపీడీవో ఎం.అప్పలనాయుడు ఆధ్వర్యంలో మండలంలో స్థానిక ఎస్సీ, బీసీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించి స్వాతంత్ర దినోత్సవం ప్రాముఖ్యత , విషయాలు గురించి వివరించి ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో పిటివిఆర్డి రామారావు, గ్రామ కార్యదర్శులు వెలుగు సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ చౌక్ బాల్ ఎంపిక పోటీలు



విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలోని పాలవలస గ్రామం అసెంట్ స్కూల్ వేదికగా జాతీయ స్థాయి చౌక్ బాల్ బాలిక మరియు బాలుర ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు సెప్టెంబర్ 22 న రాజస్థాన్ జోదపూర్ లో మొదలయ్యే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని అసెంట్ స్కూల్ పిఈటి కమ్ విశాఖ జిల్లా చౌక్ బాల్ సెక్రటరీ గాదివల్లి సురేష్ తెలిపారు. ఈ పోటీకి ఎంపిక నిర్నైతలుగా పిఈటి లు సురేష్ మరియు శివాజిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధులుగా స్టేట్ చౌక్ బాల్ సి ఈ ఓ శివరాం, జనరల్ సెక్రటరీ సుధాకర్ రావు, అసెంట్ స్కూల్ చైర్మన్ శంకర్ రావ్, డైరెక్టర్ బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దబ్బందలో న్యాయవిజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర – ఆనందపురం: దబ్బంద గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాది సర్వీసెస్ అథారిటీ (డిఎల్ఎస్ ఎ) సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయపరమైన హక్కులు కలిగి ఉన్నారని వీటిని వినియోగి ంచుకోవాలన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాల న్నారు. బాల్యవివాహాలను రూపుమాపాలన్నారు. మహిళపై దాడులను అరికట్టడానికి న్యాయస్థానం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సుబ్రమణ్యం ,తహశీల్దార్ పేర్లి శ్యామ్ ప్రసాద్, ఎస్సై గంట్యాడ సంతోష్, గ్రామ సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జున రావు, ఆర్ఐ మణికంత, గ్రామ పెద్దలు డోల మరిడి బాబు, దేవుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరములో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం గంగ నాయుడు, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్, ఎం ఎల్ హెచ్ పీ,ఏ ఎం లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ నుంచి తప్పుకున్నా

– తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: తాను ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేయాలని భావించినప్పటికీ, బొత్స మాటపై గౌరవంతో ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ప్రకటించారు. మంగళవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మీడియా సమక్షంలోనే బొత్స సత్యనారాయణతో ఫోన్లో మాట్లాడారు. బొత్స స్పందిస్తూ పెద్దల సభకు పోటీ లేకుండానే ఎంపిక అయితే గౌరవం ఉంటుందని చెప్పడంతో తాను ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు బి.వి.రామ్ ప్రకటించారు. తనకు టీడీపీతో పాటు అన్ని పార్టీలతోను సత్స బంధాలు ఉన్నాయని వైసిపి నాయకులను కేవలం విధానపరంగానే వ్యతిరేకించాను తప్ప వ్యక్తిగతంగా ఏనాడు విమర్శించలేదన్నారు. తెలుగు ప్రజల అభివృద్ధి కోసం తెలుగు శక్తి నిరంతరం పోరాటం చేస్తుందని, తెలుగు జాతి అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా తమ పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

320వాట్స్ సూపర్ సోనిక్ చార్జ్‌తో రియల్‌మీ కొత్త టెక్నాలజీ

విశాలాంధ్ర/విశాఖపట్నం: రియల్‌మీ అనేది భారత యువత లో అత్యంత పేరు గాంచిన అత్యుత్తమ బ్రాండ్. ఈరోజు రియల్ మీ తన తరువాత తరం 320వాట్స్ ఛార్జింగ్ టెక్నాలజీని పరిశ్రమలో ప్రమాణాలకు అనుగుణంగా మరలా నిర్వచించింది.320వాట్స్ సూపర్ సోనిక్ చార్జ్ శక్తి, భద్రత, సత్వర చార్జింగ్ టెక్నాలజీని తీసుకొని వచ్చింది. అది పరిశ్రమలో వినియోగదరుల అనుభవాలను కొత్త ఎత్తులకు తీసుకొని వెళ్తుంది. ఎక్కడా చూడని 320వాట్స్ సూపర్ సోనిక్ చార్జ్‌ని మాత్రమే కాకుండా రియల్‌మీ దాని 'నెంబర్ సిరీస్'- రియల్‌మీ 13 సిరీస్ 5జితో పాటు కొత్త ఎడిషన్‌ని లాంచ్ చేస్తుంది. రియల్‌మీ కొత్త నంబర్ సిరీస్ 'పనితీరు' మీద ఎక్కువ దృష్టి పెడతాయని నొక్కి చెబుతుంది. ఈ గొప్ప మార్పిడి వారి స్మార్ట్‌ఫోన్‌ల నుంచి వివిధ సమర్థ్యాలను కోరుకునే వారికి, గేమ్స్ అనుభవాలను అందించే వారికి, పూర్తి సమాధానాలను అందించే వారికి మారుతున్న అవసరాలకు తగ్గట్టు వారిని అన్ని విధాలుగా సంతృప్తి పరుస్తుంది. కేవలం ఒక్క నిమిషంలో 320వాట్స్ చార్జర్ 26% సామర్థ్యాన్ని చార్జ్ చేస్తుంది. అది ఫోన్‌ని 50% చార్జ్ చెయ్యడానికి రెండు కన్నా తక్కువ నిమిషాలు తీసుకుంటుంది.

ఆల్ న్యూ బీఎండబ్ల్యూ ఫైవ్ సిరీస్ విడుదల

విశాలాంధ్ర –విశాఖపట్నం: బిఎండబ్ల్యూ ఇండియా ఆల్–న్యూ బిఎండబ్ల్యూ 5 సిరీస్ లాంగ్ వీల్‌బేస్‌ను విడుదల చేసింది. ఇండియాలోని బిఎండబ్ల్యూడీలర్‌షిప్‌లలో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎండబ్ల్యూ డాట్ ఇన్ లో ఈ కారును బుక్ చేసుకోవచ్చు. సెప్టెంబర్ 2024 నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయి. ఈ బిఎండబ్ల్యూ 5 సిరీస్ బిఎండబ్ల్యూ బ్రాండ్ హృదయంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా, ఇద ప్రతిష్టాత్మక ఎగ్జిక్యూటివ్ సెడాన్ సెగ్మెంట్‌లో కొన్నేళ్లుగా మార్కెట్‌లో లీడర్‌గా ఉంది. మొదటి తరం 1972లో ప్రారంభించినప్పటి నుంచి 5 సిరీస్‌లు దాదాపు 10 మిలియన్ యూనిట్లు అమ్ముడయ్యాయి. అధునాతన సాంకేతిక టెక్నాలజీతో విభిన్న ఫీచర్లతో సదుపాయాలతో ఈ కారు అందుబాటులో ఉందని సంస్థ ప్రతినిధి చెప్పారు.

ప్రత్యేక డీల్స్‌తో ఇండిపెండెన్స్ సేల్‌ను ఆవిష్కరించిన క్రోమా

విశాలాంధ్ర– విశాఖపట్నం: భారత దేశవ్యాప్తంగా 525 పైచిలుకు స్టోర్స్‌తో క్రోమా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక రాయితీలతో సేల్ ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాల విస్తృత శ్రేణిపై అద్భుతమైన ఆఫర్లు అందిస్తోంది. 2024 ఆగస్టు 9 నుంచి 2024 ఆగస్టు 18 వరకు నిర్వహించే ఈ సేల్‌లో కస్టమర్లు అద్భుతమైన డీల్స్, ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్లు, సరళతరమైన చెల్లింపు ఆప్షన్లను ఇటు ఇన్–స్టోర్‌లో అటు ఆన్‌లైన్‌లో క్రోమా డాట్ కామ్ లో టాటా ఎన్ ఈయూ యాప్‌లో పొందవచ్చు. ఎంటర్‌టైన్‌మెంట్ సిస్టంలను మెరుగుపర్చుకోదల్చుకున్న వారి కోసం క్రోమా కేవలం రూ. 24,999 నుంచే యుహెచ్డీ స్మార్ట్ టీవీలను అందిస్తోంది. అలాగే నిర్దిష్ట స్మార్ట్ ఎల్ఈడీ టీవీలపై 70 శాతం వరకు డిస్కౌంట్లు, పాత టీవీలపై రూ. 5,000 వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలను అందిస్తోంది.